# విశాలాంధ్ర

ప్రకాశం బాపట్ల

గురువారం 13 ఫిబ్రవరి 2025 8 పేజీలు


# వృధాగా ప్రభుత్వ భవనాలు

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా సచివాలయ భవనాలు
- రూ.లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేసిన వైనం
- ఆర్బీకే, సచివాలయం, ఆరోగ్య కేంద్రాల పేరిట గత ప్రభుత్వం హడావుడి
- సరైన వసతులు కల్పించకుండానే నిర్మాణాలు పూర్తి
- నేటికీ పలుచోట్ల నిరుపయోగంగా భవనాలు

విశాలాంధ్ర - పిసీపల్లి :
ఆర్బీకేలు, సచివాలయం, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల పేరిట గత ప్రభుత్వం హడావుడి చేసింది. పీసీపల్లి మండల వ్యాప్తంగా 13 సచివాలయం, ఆర్‌బికే హెల్త్ సెంటర్లకు సంబంధించి నిర్మాణాలను చేపట్టింది. అయితే వీటి నిర్మాణాలు అనుకున్నంత వేగంగా జరగలేదు. దీంతో ఎన్నికల ముందు వీటి నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధి పొందాలనుకుంది. మౌలిక వసతులు కల్పించటంలో శ్రద్ధ వహించకుండా నిర్మించటంతో ప్రస్తుతం ఈ భవనాలు అన్నీ నిరుపయోగంగా మారిపోయాయి. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా నిర్మించటంతో రూ.కోట్లలో ప్రజాధనం వృథా అయిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గత ప్రభుత్వం రైతులకు రైతు సేవలు అందించేందుకు ఆర్బీకే (రైతు భరోసా కేంద్రాలు), ప్రజలకు కావాల్సిన సేవలందించేందుకు సచివాలయాలు, వైద్య సేవలు అందించేందుక ఆరోగ్య కేంద్రాలను కట్టించేందుకు పూనుకుంది. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే దీనికి సంబంధించిన పనులు మొదలుపెట్టింది. ప్రభుత్వం బిల్లులు వెంటనే విడుదల చేస్తుందన్న ఆశతో కాంట్రాక్టర్లు వీటి పనులు మొదలుపెట్టారు. గత ప్రభుత్వం ఎప్పటికపుడు బిల్లులు విడుదల చేయకుండా పెండింగ్ పెట్టడం మొదలుపెట్టింది. దీంతో కాంట్రాక్టర్లు చేపట్టిన నిర్మాణాలను తర్వాత కొనసాగించలేదు. అప్పటి వరకు జోరుగా సాగిన ఆయా నిర్మాణాలు తర్వాత కుంటుపడ్డాయి. దీంతో అప్పటి ప్రభుత్వంలో నాలుగేళ్ల పాటు నిర్మాణాలు పూర్తి కాలేదు. చేపట్టిన నిర్మాణాలు పూర్తి చేయకపోతే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని తద్వారా ఎన్నికల్లో దెబ్బ పడుతుందని వైసీపీ నేతలు భావించారు. ఎన్నికల ఏడాది ఆర్బీకే, సచివాలయం, ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు పూర్తి ఆర్భాటంగా పూర్తి చేసి కొన్నింటిని ప్రారంభించింది. ఈ భవనాలకు విద్యుత్తు, నీటి సరఫరా

మిగతా 2 లో ...

# భూముల రీసర్వేలో నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

**విశాలాంధ్ర - ఒంగోలు :** భూముల రీసర్వేలో నిర్లక్ష్యం వద్దని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. బుధవారం ఆమె కొత్తపట్నం మండలంలోని గాదెపాలెం గ్రామంలో పర్యటించారు. ఈ గ్రామంలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించారు. ఈ గ్రామంలో 124 మంది రైతులకు చెందిన సుమారు 650 ఎకరాలను సర్వే చేశామని, విలేజ్ బౌండరీ కూడా సర్వే చేశామని, ప్రభుత్వ భూముల సర్వే 50శాతం పూర్తయిందని అధికారులు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.... ఎంతమంది రైతులకు సంబంధించిన భూములను ఈరోజు సర్వే చేశారు?..ఎన్ని టీములు ఫీల్డ్ విజిట్లో ఉన్నాయి?... అని అధికారులను అడిగారు. నాలుగు టీములు ఫీల్డ్‌లో పని చేస్తున్నాయని, ఒక్కో టీముకు 20 ఎకరాల చొప్పున కేటాయించామని అధికారులు తెలిపారు. దీనితో ఆర్డీవో శ్రీమతి లక్ష్మీ ప్రసన్న ద్వారా ఇద్దరు రైతులకు ఫోన్ చేయించారు. ఎన్ని రోజుల ముందుగా సర్వేకు సంబంధించిన నోటీసులు ఇచ్చారు?... మీ సమక్షంలోనే భూములను సర్వే చేశారా?... అని ఆర్డివో ద్వారా ఆరా తీశారు. భూముల మ్యుటేషన్ విషయంలో నిబంధనలు ఉల్లంఘించరాదని అధికారులకు ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట సర్వే శాఖ సహాయ సంచాలకులు శ్రీ.గౌస్ బాషా, తహసీల్దారు మధు సూదనరావు, మండల సర్వేయర్ ఉన్నారు.

# ప్రాణాలు తీసిన కుటుంబ కలహాలు

రేపల్లెలో తల్లి కొడుకు ఆత్మహత్య

**విశాలాంధ్ర - రేపల్లె :** భార్య విడాకులు కోరుతుందనే భయంతో భర్త ఆత్మహత్యకు పాల్పడగా, కొడుకు మృతిని జీర్ణించుకోలేక తల్లి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని 4వ వార్డు రజక వీధిలో రాజకుమారి అనే మహిళ కొడుకు(నాగేంద్ర), కోడలు (లక్ష్మీతిరుపతమ్మ), మనుమడు (ఆంజనేయులు) తో కలసి నివాసం ఉంటుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో లక్ష్మీతిరుపతమ్మ తన కొడుకుని తీసుకుని వెళ్లి పుట్టింటి వద్ద ఉంటున్నట్లు, గత కొద్ది రోజులు తన భర్తకు విడాకుల నోటీసులు పంపినట్లు, తన భార్య తన వద్దకు రాదేమోనని మనస్తాపముతో ఈనెల 10వ తేదీన ఇంటిలో ఎవరు లేని సమయములో ఆత్మహత్య చేసుకున్నట్లు, కొడుకు చనిపోవడము చూసిన అతని తల్లి అయిన రాజకుమారి కుడా ఆత్మహత్య చేసుకుని చనిపోయినట్లు ఇరుగుపొరుగు వారు మంగళవారం తల్లి కొడుకుల శవములను చూసి నాగేంద్ర బాబాయ్ అయిన వెల్లటూరు శ్రీమన్నా రాయణకు తెలియ పరచగా అతను వచ్చి జరిగిన విషయము తెలుసుకుని స్థానిక పోలీస్ స్టేషన్లో రిపోర్ట్ ఇవ్వడము జరిగింది.సీఐ మల్లిఖార్జునరావు, ఎస్సై రాజశేఖర్ నేరస్తలముకు వెళ్లి ఆదారములు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

# పకడ్బందీగా ఎస్ఎస్‌సీ పరీక్షలు నిర్వహించాలి

జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్

విశాలాంధ్ర - బాపట్ల :
ఎస్ఎస్‌సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ ఆదేశించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అనుబంధశాఖల అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. పరీక్షల నిర్వహణకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సంయుక్త కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మాదిరిగా మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఎస్ఎస్‌సి పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ ఏడాది బాపట్ల జిల్లాలో 16,799 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, ఇందుకోసం 103 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశామన్నారు.1,048 ఉంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. 26 మంది ఏఎన్ఎంలను పరీక్షా కేంద్రాల వద్ద నియమించాలని ఆదేశించారు. అపాస్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 10 కేంద్రాలు ఏర్పాటు చేశామని,ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.838మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరవుతున్నారని చెప్పారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నియమించామని, ప్రతి కేంద్రం పర్యవేక్షణ కొరకు అధికారులను నియమించామన్నారు. పోలీస్ బందోబస్తు ప్రత్యేకంగా నియమించాలని పోలీస్ అధికారులను ఆయన ఆదేశించారు.పగటి ఉష్ణోగ్రతలు అధికమయ్యే అవకాశం ఉన్నందున విద్యార్థుల కొరకు తాగునీటి సౌకర్యం,ప్రాథమిక చికిత్స కిట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.పరీక్షా కేంద్రాలలోని మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలు ముందస్తుగా చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్‌లు ఎట్టి పరిస్థితులలో అనుమతించేది లేదని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. విద్యార్థులే గాకుండా విధులు నిర్వహించే సిబ్బంది సైతం ఎవరూ సెల్ ఫోన్‌లను పరీక్షా కేంద్రాలలోకి వెంట తీసుకురాకూడదని స్పష్టం చేశారు.పరీక్షా కేంద్రాలలోకి ఫోన్లు తీసుకు వెళ్ళకుండా నివారించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు.పరీక్షా కేంద్రాల ప్రధాన ద్వారం వద్ద ముందస్తుగా తనిఖీలు చేయాలన్నారు.ప్రశ్నా పత్రాలు లిక్ జరగకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు.ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు.సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూత వేయించాలన్నారు.మార్చి 11వ తేదీన ప్రశ్నాపత్రాలు బాపట్ల కేంద్రానికి చేరతాయని, స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలన్నారు. పరీక్ష కేంద్రాలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు పోలీస్ స్టేషన్‌లలో భద్రపరచాలన్నారు.స్ట్రాంగ్ రూమ్‌కి 24 గంటల పాటు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అంతరాయం లేకుండా ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్,జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం,ఇంటర్మీడియట్ బోర్డ్ ఆర్ఐఓ యర్రయ్య పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాలు తనిఖీ చేసిన తహసీల్దార్

**విశాలాంధ్ర - చెరుకుపల్లి :** రేషన్ దుకాణదారులు తమ పరిధిలోని ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తాహశీల్దార్ సిహెచ్ పద్మావతి అన్నారు.బుధవారం ఆమె జిల్లా పరిపాలనాధికారి ఆదేశాల మేరకు పలు రేషన్ దుకాణాలను పరిశీలించారు. స్టాకు రిజిస్టర్ పంపిణీ రిజిస్టర్ సక్రమంగా సరిపోయేలా ఉండాలని లేకుంటే ఆ దుకాణాలపై చర్యలు తప్పవని ఆమె అన్నారు.ఏ ఒక్కరి నుండి కూడా రేషన్ సరుకులు అందలేదు అనే ఫిర్యాదు తమ దృష్టికి రాకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మౌనిక, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వనరులలో వాటా నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కావాలి

**- దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కన్వీనర్ అల్లడి దేవకుమార్**

**విశాలాంధ్ర - బాపట్ల టౌన్ :** 2025-26 బడ్జెట్ దళిత గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుదల లక్ష్యంగా కేటాయింపులు పెంచాలి అని దళిత గిరిజన బడ్జెట్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ తెలిపారు. బుధవారం జిల్లా బడ్జెట్ వాచ్ సమావేశం బాపట్ల పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో జిల్లా కన్వీనర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అల్లడి దేవకుమార్ మాట్లాడుతూ దళిత గిరిజనులకు జనాభా ప్రాతిపదిక నిధుల కేటాయింపులు చేసి వాటిని ఖర్చు చేయవలసిన అవసరం ఉందని ప్రజా సంఘాలు, ఎన్జీవోలు,రాజకీయ పార్టీలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది దగ్గుమల్లి కిరణ్, దళిత గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా చైర్మన్ దేవరపల్లి డేవిడ్‌రాజు, బీఎస్పీ నాయకులు జి.రాజారావు,జై భీమ్ రావు భారత్ పార్టీ నాయకులు గోవా రమేష్ రంజి,పర్రె కోటయ్య, కె.వినయ్‌రాజు, గిరిజన నాయకులు దేవరకొండ రాము,డిబిఆర్‌సి ఏరియా కో-ఆర్డినేటర్లు నూతలపాటి శ్రీలత,వి.భగవాన్‌దాస్, సిపిఎం నాయకులు సిహెచ్ గంగయ్య,వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు

**విశాలాంధ్ర - బల్లికురవ :** విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో అద్దంకి - సంతమాగులూరు రోడ్డు పరిధిలోని 14/10 కిలోమీటరు వద్ద ఎన్ఎస్పీ కాలువ వంతెనపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కొరకు రూ.2కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారు.ఈ మేరకు బుధవారం రోడ్లు,రవాణా,భవనాల శాఖా ఉత్తర్వులు (జివో.ఆర్టీ నం.62) జారీ చేశారు.ఈ బ్రిడ్జి నిర్మాణంతో ప్రజలకు రైతాంగానికి రాకపోకలకు అత్యంత మేలు చేకూరనుందని రైతులు,ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## టైర్ పంచర్‌తో మినీ లారీ బోల్తా

**విశాలాంధ్ర-పామూరు రూరల్:** కర్రలలోడుతో కందుకూరు వైపు కర్రల లోడుతో వెళ్తున్న మినీ లారీ మోపాడు వద్ద టైరు పంచర్ కావడంతో అదుపుతప్పి రోడ్డుపై బోల్తా కొట్టిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. డ్రైవర్ క్లీనర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి క్రేన్ సహాయముతో లారీని పైకి లేపి వాహనాల రాకపోకలకు వీలు కల్పించారు.

# చిరస్మరణీయుడు మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని

**విశాలాంధ్ర-పామూరు:** నేటి రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడు, జనహృదయనేత ఇరిగినేని తిరుపతి నాయుడు చిరస్మరణీయుడని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి అన్నారు. కనిగిరి మాజీ శాసనసభ్యులు ఇరిగినేని తిరుపతి నాయుడు ఎనిమిదవ వర్ధంతి వేడుకలను స్వగ్రామమైన మోపాడులో కుటుంబ సభ్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు. వర్ధంతి వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ మోపాడు సర్పంచిగా, కనిగిరి సమితి ప్రెసిడెంట్ గా, మూడు పర్యాయాలు కనిగిరి శాసనసభ్యునిగా సేవలందించి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాతగా ప్రజల హృదయాల్లో నిలిచిన మహనీయుడు ఇరిగినేని తిరుపతి నాయుడు అని కొనియాడారు. ముందుగా ఇరిగినేని తనయుడు రవీంద్రబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్ రావు ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి బొట్లగూడూరు, మోపాడు బస్టాండ్ లలో ఉన్న ఇరిగినేని విగ్రహాలకు అనంతరం మోపాడు లో ఇరిగినేని ఘాట్ వద్ద పూలమాలతో ఉగ్ర నరసింహారెడ్డి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ను అడిగి సమస్యలను ఉగ్ర నరసింహ రెడ్డి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యువ నాయకులు, పారిశ్రామికవేత్త యారవ శ్రీనివాసులు, నాయకులు ఎంపీటీసీ బొల్లా నరసింహారావు చౌదరి, సయ్యద్ అమీర్ బాబు, సానికొమ్ము విజయభాస్కర్ రెడ్డి, డివి మనోహర్, మెంట నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు,షేక్ గౌస్ బాషా, షేక్ కాజా రహమతుల్లా, బిల్డర్ పువ్వాడి వెంకటేశ్వర్లు, గుర్రం వెంకటేశ్వర్లు, కోటపాటి నరసింహారావు, మూవీ నా మౌలాలి, నర్సింగ్ సాంబయ్య పార్టీలకు అతీతంగా పాల్గొని ఇరిగినేనికి ఘన నివాళులర్పించారు.

# కౌలు రైతులను ఆదుకోవాలి

**విశాలాంధ్ర -ముండ్లమూరు :** కౌలు రైతుల రక్షణ మరియు సంక్షేమం కోసం ప్రత్యేకమైన చట్టాన్ని వెంటనే తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కే అచ్చం నాయుడు కు తెలియజేస్తూ స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఎల్ లక్ష్మీనారాయణకు సిపిఐ మండల కార్యదర్శి సుంకర అంజిరెడ్డి వినత పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పుల నేపధ్యంలో కౌలు రైతులు అధిక సంఖ్యలో పంటలు పండిస్తున్నారు అని అన్నారు. అన్ని పంటలలో, అన్ని ప్రాంతాలలో కౌలు వ్యవసాయం రోజు రోజుకో విస్తరిస్తుందని చెప్పారు. అయితే ఆహార పంటలు ,అపరాలు, ఉద్యాన వన పంటలు పండిస్తున్న కౌలు రైతులకు మాత్రం ప్రభుత్వం నుండి ఎటువంటి పథకాలు బ్యాంకు రుణాలు ఏవి అందడం లేదని అన్నారు. కనీసం కౌలు రైతుల గుర్తింపు కార్డులు కావాలన్నా భూమి యజమాని సంతకం ఉండాలని ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల హక్కు చట్టం 2019లో నిబంధనలు ఉండడంతో భూమి యజమానులు ఎవరు సంతకం పెట్టడానికి ముందుకు రావడం లేదని అన్నారు.

ఈ కారణంతో కౌలు రైతుల గుర్తింపు కార్డుల పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది భూమి యజమానులు తమ కుటుంబ సభ్యులకు బినామీదారులకు గుర్తింపు కార్డులు పంచుకుంటున్నారని ఆరోపణ చేశారు. ఇటువంటి పరిస్థితుల లో వడ్డీ వ్యాపారస్తులకు కనుసనలలోనే కౌలు సేద్యం జరుగుతుందని అన్నారు. పండించిన పంటలకు కూడా మద్దతు ధర దక్కకపోవడంతో అప్పుల బాధలు పెరిగి అతి చిన్న వయసులోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు.

ఈ ఎనిమిది నెలల కాలంలో 97 మంది పైగా ఆత్మ హత్య చేసుకున్నారని చెప్పారు. కౌలు రైతులు పండిస్తున్న అన్ని పంటలకు బీమా పథకాన్ని వర్తింపజేసి ప్రీమియం మొత్తాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లించాలి, భూమిలేని కౌలు రైతులందరి కి అన్నదాత సుఖీభవ పథకం కింద తక్షణమే 20 వేలు పెట్టుబడి సాయం అందించాలి, ప్రకృతి విపత్తులు, చీడపీడలు సంభవించి పంటలు దెబ్బతిన్న సందర్భాల్లో బీమా పరిహారాలు, ఇన్ పుడ్ సబ్సిడీలు కౌలు రైతులకు అందించాలి. దేవాదాయ, ధర్మాదాయ, వక్ఫ్ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ వ్యవసాయ, ఉద్యానవన పథకాలను బ్యాంకులు ఇచ్చే పంట రుణాలు తదితర పథకాలు వర్తింపజేయాలి. కౌలు రైతుల పండిస్తున్న పంటలను ఈ పంటలో నమోద్ చేసి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునే విధంగా వెసులుబాటు కల్పించాలి, ఇటీవల కాలంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతు, కౌలు రైతులకు తక్షణమే ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలి. ఈ కార్యక్రమంలో ఎస్ బ్రహ్మారెడ్డి, సుంకర సుజాత, ఎర్రిబోయిన కోటయ్య, ఎర్రిబోయిన అనంతలక్ష్మి, షేక్ సైదా హసన్,డాకా కన్నా రెడ్డి, ఏ హుస్సేన్, జె ఏడు కొండలు, ప్రేమ్ పాల్గొన్నారు.

# వృథాగా ప్రభుత్వ భవనాలు

(మొదటిపేజీ తరువాయి)

వంటి మౌలిక వసతులు కల్పించటంలో విఫలమవటంతో భవనాలు ఉపయోగంలోనికి రాకుండా పోయాయి. దీంతో రూ.కోట్ల రూపాయలు ఇచ్చి అలంకారప్రాయంగా నూతన భవనాలను నిర్మించినా కొన్నిచోట్ల ప్రారంభంనికి సైతం నోచుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారి శిథిలావస్థకు చేరుతున్నాయి.

**లక్షలు వెచ్చించి... లక్షణంగా వదిలేశారు**

ఆర్బీకే, సచివాలయం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం వంటి వాటి నిర్మాణాలను జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో పూర్తి చేసేలా నిర్మాణాలను చేపట్టింది. సచివాలయ భవనానికి రూ.40 లక్షలు, ఆర్బీకేలకు రూ.21.80 లక్షలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు రూ.14.95 లక్షల చొప్పున ప్రభుత్వం వెచ్చించింది. మండల వ్యాప్తంగా 13 గ్రామ వార్డు సచివాలయాలను నూతనంగా నిర్మించగా వాటిలో ఏడు నూతన సచివాలయ భవనాలు మాత్రమే ప్రారంభమయ్యాయి పెదఅలవలపాడు గుదేవారిపాలెం లక్ష్మక్కపల్లి చింతగుంపల్లి పంచాయతీల పరిధిలోని గ్రామ వార్డు సచివాలయాలు కనీసం ప్రారంభానికి కూడా నోచుకోలేదు. దీంతో ఆయా మండలాల్లోని సచివాలయాలు, ఆర్బీకేలు, ఆరోగ్య కేంద్రాలు పంచాయతీ భవనాల్లోని నడుస్తున్నాయి. దీంతో గత ప్రభుత్వం ప్రభుత్వం కేవలం ఆర్భాటం కోసం చేసిన పనివల్ల వందల కోట్ల రూపాయలు ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరైందన్న విమర్శలు వ్యక్తఓమవుతున్నాయి.

**అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా సచివాలయ భవనాలు**

ప్రారంభానికి సైతం నోచుకోకపోవడంతో పెదఅలవలపాడు గుదేవారిపాలెం లక్ష్మక్క పల్లి చింతగుంపల్లి గ్రామ వార్డు సచివాలయాలు రాత్రి వేళల్లో అసాంఘిక శక్తుల కార్యకలాపాలకు నిలయంగా మారాయి. లక్షణంగా ఉన్న సచివాలయాలను సైతం మందు బాబులు తాగిన మైకంలో ధ్వంసం చేస్తున్నారు. దీంతో నూతనంగా నిర్మించిన గ్రామ వార్డు సచివాలయాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కోట్ల రూపాయలు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన నూతన సచివాలయ భవనాలు బూడిదలో పోసిన పన్నీరుగా దర్శనమిస్తున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**కనీస వసతులు లేకనే...**

మండలంలోని పెద అలవలపాడు గుదేవారిపాలెం లక్ష్మక్క పల్లి చింతగుంపల్లి గ్రామ వార్డు సచివాలయాలు నేటికీ ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఈ విషయంపై పంచాయతీరాజ్ ఏఈ తిరుపాలయ్యను విశాలాంధ్ర విలేఖరి వివరణ కోరగా నాలుగు చోట్ల సచివాలయ భవనాలలో కరెంటు సప్లై లేకపోవడంతోనే ప్రారంభోత్సవానికి నోచుకోలేదని మరికొన్నిచోట్ల కరెంటు సప్లై తో పాటు టాయిలెట్ నీళ్ల వసతి కూడా లేకపోవడంతోనే నేటికీ ప్రారంభం కాకుండా ఉన్నాయన్నారు. ఉన్నతాధికారుల స్పందించి రూ కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన నూతన సచివాలయ భవనాలను ప్రారంభించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

# స్వచ్ఛత గ్రీన్ లీఫ్ విజయవంతం చేయాలి

## జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

**విశాలాంధ్ర – బాపట్ల :** స్వచ్ఛత గ్రీన్ లీఫ్ కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.కేంద్ర ప్రభుత్వం గ్రామీణ నీటిసరఫరా పారిశుధ్య శాఖ, టూరిజం శాఖతో కలసి, ప్రారంభించిన స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ విధానానికి సంబంధించి తొలి జిల్లా కమిటీ సమావేశాన్ని జేసీ బుధవారం కలెక్టరేట్ కొత్త వీడియో సమావేశ మందిరంలో నిర్వహించారు. బాపట్ల,చీరాల,రేపల్లె డివిజన్ కమిటీలతో భేటీ నిర్వహించారు. జిల్లా కమిటీ లో కలెక్టర్ చైర్మన్,జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహనాధికారి,జిల్లా పంచాయతీ అధికారి సభ్యులుగా,గ్రామీణ నీటిసరఫరా పర్యవేక్షక ఇంజనీర్ కన్వీనర్‌గా,జిల్లా టూరిజం అధికారి సభ్య కార్యదర్శిగా ఉంటారు. డివిజన్ కమిటీలో రెవిన్యూ డివిజన్ అధికారి చైర్మన్‌గా, డివిజనల్ అభివృద్ధి అధికారి,హెడ్ క్వార్టర్ మండల అభివృద్ధి అధికారి సభ్యులుగా,గ్రామీణ నీటిసరఫరా ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ కన్వీనర్‌గా ఉంటారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆతిథ్య సేవలు అందించే హోటల్స్,హోమ్ స్టేలు,లాడ్జిలు,ధర్మశాలలు మొదలగు వాటిలో పారిశుధ్య నిర్వహణ, మురుగునీటి నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ మొదలగు అంశాలకు సంబంధించి, హోటల్స్ లాంటి సంస్థలను గుర్తించి,వాటిలో పని చేసేవారికి, పైన తెలిపిన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి మొదటి దశలో ఫిబ్రవరి 28వ తేదీ నాటికీ జరుగుతుందని,తర్వాత దశలో మార్చి 15వ తేదీ నాటికి,ఆయా సంస్థలు వ్యర్థ నిర్వహణ సక్రమంగా నిర్వహించి తదుపరి వాళ్ళు గ్రీన్ లీఫ్ రేటింగ్‌కు సరిపడేలా, వ్యర్థాల నిర్వహణ చేస్తున్నట్లు, డివిజన్ కమిటీలకు తెలియచేయాలన్నారు. తర్వాత దశలో డివిజన్ కమిటీలు ఆయా సంస్థలను తనిఖీ చేసి,అక్కడ జరుగుతున్న వ్యర్థాల నిర్వహణను మూల్యాంకనం చేసి,ఆ సంస్థకు గ్రీన్ లీఫ్ రేటింగ్‌ను 1వ లీఫ్,3వ లీఫ్,5వ లీఫ్‌లలో ఒకదాన్ని ఇస్తూ, మార్చి 31వ తేదీలోపు, జిల్లా కమిటీకు సిఫారసు చేస్తారన్నారు. జిల్లా కమిటీ, డివిజన్ కమిటీల సిఫారసులను పరిశీలించి, వాటిలో కొన్నింటికి, ఏప్రిల్ 30వ తేదీ నాటికి గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మొదటి విడతగా ప్రతి డివిజన్‌లో హెడ్ క్వార్టర్ మండలంలో ఈ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహనాధికారులు, జిల్లా పంచాయతీ అధికారి, గ్రామీణ నీటిసరఫరా పర్యవేక్షక ఇంజనీర్, రెవిన్యూ డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యశాలలో గుండెపోటు నివారణ ఇంజక్షన్

**విశాలాంధ్ర – అద్దంకి :** అద్దంకి సామాజిక ఆరోగ్య కేంద్రంలో గుండెపోటు నివారణ ఇంజక్షన్ అందుబాటులో ఉందని వైద్యాధికారి డాక్టర్ శరత్ కుమార్ తెలిపారు. బుధవారం సిహెచ్‌సీలో గుండెపోటు వచ్చిన వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు,అందుబాటులో ఉన్న ఇంజక్షన్ గురించి రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శరత్ కుమార్ మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన వెంటనే ఆసుపత్రికి వచ్చినట్లయితే రూ.40 వేల ఖరీదైన ఇంజక్షన్‌ను ఉచితంగా వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అనిత జ్యోతి,డాక్టర్ ప్రదీప్,డాక్టర్ మెర్సి తదితరులు పాల్గొన్నారు.

# 16న జాతీయ స్థాయి కరాటే పోటీలు

**విశాలాంధ్ర – అద్దంకి :** ఈనెల 16న అద్దంకి శ్రీనివాస ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆర్బీ డ్రాగన్స్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ రాంబాబు బుధవారం తెలిపారు. రాంబాబు మాట్లాడుతూ పోటీలకు ఎనిమిది రాష్ట్రాల నుంచి 700 మంది పాల్గొంటున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సినీ హీరో సుమన్ హాజరవుతున్నట్లు తెలిపారు. పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్స్ బుధవారం అద్దంకిలో ఆవిష్కరించారు.

# రైతులు గుర్తింపు ఐడి పొందాలి

**విశాలాంధ్ర – చీరాల రూరల్ :** మండలంలో పంటసాగు చేస్తున్న రైతులందరూ రైతు ఐడీ పొందాలని చీరాల మండల వ్యవసాయ అధికారి ఐ. సుమతి అన్నారు. మండలంలో రామకృష్ణాపురం,గాంధీనగర్ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. మాట్లాడుతూ రైతు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య గురించి,దానివలన కలుగు ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి,రైతు గుర్తింపు సంఖ్య పొందవచ్చునన్నారు.రైతులు వారి ఆధార్ నెంబర్, ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నెంబర్,భూమి రికార్డుల వివరములు అందించి ఐడి పొందాలన్నారు. చీరాల మండలంలో 500 మందికి రైతు ఐడీలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ సహాయకులు బత్షెబా,లావణ్య,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో మంత్రి గొట్టిపాటి

**విశాలాంధ్ర – బల్లికురవ :** మండల పరిధిలోని పలు వివాహ శుభకార్యములకు బుధవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన ధూళిపాళ్ళ వెంకటేశ్వర్లు కుమారుడు సాయిబాబా వివాహ మహోత్సవానికి హాజరై నూతన వరుడు సాయిబాబాని ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అదే గ్రామానికి చెందిన ధూళిపాళ్ళ హనుమంతరావు కుమారుని వివాహ మహోత్సవానికి హాజరై నూతన వరుడు శ్రీకాంత్‌ని ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంత మాగులూరు మండలం మక్కినవారిపాలెం గ్రామానికి చెందిన గుంజి అంకమ్మ కుమారుని వివాహా నికి హాజరై నూతన వరుడుని ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వెంట నక్క బొక్కలపాడు గ్రామ సర్పంచ్ దూళిపాళ్ళ బుల్లిరామయ్య, ధూళిపాళ్ళ హనుమంతరావు, మలినేడి గోవిందరావు, గొట్టిపాటి లక్ష్మయ్య, బెల్లంకొండ సుబ్బారావు, స్థానిక తెదేపా నేతలు తదితరులు ఉన్నారు.

# కొప్పరపాడులో 'పొలం పిలుస్తోంది'

**విశాలాంధ్ర – బల్లికురవ :** మండల పరిధిలోని కొప్పెరపాడు,ఎన్ఎల్ గుడిపాడు గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్పిపి కుమారి రైతులతో కలిసి మొక్కజొన్న, వరి పొలాలను పరిశీలించారు. వరిలో ఉల్లికోడు, మొక్కజొన్నలో కత్తెర పురుగు గమనించి నివారణ చర్యలు రైతులకు సూచించారు. ఉల్లికోడు నివారణకు ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్, 3జి గుళికలు ఎకరాకు 10 కిలోల చొప్పున వేసుకోవాలని సూచించారు. రైతుల రిజిస్ట్రేషన్‌కు కావలసినవి పొలం పాసుపుస్తకం,ఆధార్ కార్డు జెరాక్స్,ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకొని రైతు సేవా కేద్రానికి వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిఏలు పవన్ సాయి,రమణయ్య,ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# వైభవంగా శివపార్వతుల కళ్యాణం

**విశాలాంధ్ర – అద్దంకి :** పట్టణంలోని గంగా వింధ్య సమేత నగరేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మాఘ పౌర్ణమి పురస్కరించుకొని శివపార్వతుల కళ్యాణాన్ని ఆలయ ప్రధాన పూజారి కంఠంరాజు శర్మ ఆధ్వర్యంలో పూజారులు వైభవంగా జరిపించారు. అద్దంకి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కళ్యాణాన్ని తిలకించి పూజలు నిర్వహించారు. భక్తులకు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు.


VASTU HOUSING FINANCE

**వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్**

యూనిట్ 203 & 204, 2 వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. మహారాష్ట్ర.
సిఐఎన్ నం. : యు65922ఎంహెచ్2005పిఎల్‌సి272501

**స్వాధీనత ప్రకటన**

సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్టు చట్టం -2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు-2002 నిబంధన 9తో చదివే సెక్షన్ 13(12) కింద అతనికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అధీకృత అధికారిగా ఈ దిగువ సంతకందారు ఈ కింద పేర్కొన్న రుణగ్రహీతలకు సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా సంబంధిత నోటీసులో పేర్కొన్న బకాయిలను తిరిగి చెల్లించవలసిందిగా ఈ కింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. రుణగ్రహీతలు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పైన పేర్కొన్న చట్ట నిబంధనల్లో నిబంధనల 9తో చదివే సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు ఈ కింద వివరించిన షెడ్యూల్ ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది.
ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని,ఈ ఆస్తితో ఏ ఒప్పందాలైనా ఈ కింద పేర్కొన్న మొత్తం బకాయి మరియు దానిపై వడ్డీ, వ్యయాలు మొదలైనవాటి కొరకు వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ బ్రాంచ్ చార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి రుణగ్రహీత, హామీదారు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

| వ. నం. | రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎకౌంట్ నం. | డిమాండ్ నోటీసు తేదీ మొత్తం బకాయి | ఆస్తి యొక్క వివరాలు | స్వాధీనత రకం & తేదీ |
|---|---|---|---|---|
| 1 | కొల్లా మల్లికార్జునరావు (మరణించారు) చట్టబద్ధ వారసులందరి ద్వారా(రుణగ్రహీత), కొల్లా శ్రీదేవి, లేటు శ్రీ కొల్లా మల్లికార్జునరావు భార్య (సహ-రుణగ్రహీత మరియు మరణించిన రుణగ్రహీత చట్టబద్ధవారసులు), కొల్లా పార్థివ్ నాగవెంకట సాయి కోమల్, లేటు శ్రీ కొల్లా మల్లికార్జునరావు కుమారుడు (సంరక్షకురాలు కొల్లా శ్రీదేవి ద్వారా మరియు మరణించిన రుణగ్రహీత చట్టబద్ధవారసులు) కొల్లా పర్థిష్ శివ విష్ణు సుహాస్, లేటు శ్రీ కొల్లా మల్లికార్జునరావు కుమారుడు (సంరక్షకురాలు కొల్లా శ్రీదేవి ద్వారా మరియు మరణించిన రుణగ్రహీత చట్టబద్ధవారసులు) HL0000000054854 | 18-సెప్టెంబరు-23 **14-సెప్టెంబరు-23 నాటికి రూ.2010099** | ఆంధ్రప్రదేశ్, 523001. ప్రకాశం జిల్లా, ఒంగోలు, మిరియాల పాలెం, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, బ్లాక్ నం:2, ఒంగోలు మున్సిపల్ వార్డ్ నం.6, పాత డి.నం. 49-1-26(2), కొత్త డి.నం.49-1-38, టి.ఎస్.నం.136, 763 చదరపు అడుగులు లేదా 10 గడీల 59 చదరపు అడుగులు లేదా 84.7 చదరపు గజాల విస్తీర్ణపు స్థలం. హద్దులు: ఉత్తరం: గ్రైన్ బజార్, దక్షిణం: నందూరి యానాది రావు మరియు ప్రతిమ మిగిలిన స్థలం, తూర్పు: గడిరెడ్డి లక్ష్మీనారాయణ మరియు ఇతరుల ఆస్తి, పడమర: కొంత విస్తీర్ణం మున్సిపల్ బజార్, కొంత విస్తీర్ణం గొర్రెపాటి సీపుల్ యొక్క ఆస్తి. | లాంఛనప్రాయ స్వాధీనత స్వాధీనత తేదీ: 07-ఫిబ్రవరి -2025 |
| | తిరుమలశెట్టి కృష్ణ (మరణించారు) చట్టబద్ధ వారసులందరి ద్వారా(రుణగ్రహీత), తిరుమలశెట్టి లక్ష్మి, లేటు శ్రీ తిరుమలశెట్టి కృష్ణ భార్య మరియు శ్రీ తిరుమలశెట్టి కృష్ణ (మరణించినప్పటి నుంచి) చట్టబద్ధవారసులు, తిరుమలశెట్టి సుమారజిత, లేటు శ్రీ తిరుమలశెట్టి కృష్ణ కుమార్తె మరియు శ్రీ తిరుమలశెట్టి కృష్ణ (మరణించినప్పటి నుంచి) చట్టబద్ధవారసులు, తిరుమలశెట్టి లిఖిత లేటు శ్రీ తిరుమలశెట్టి కృష్ణ కుమార్తె మరియు శ్రీ తిరుమలశెట్టి కృష్ణ (మరణించినప్పటి నుంచి) చట్టబద్ధవారసులు. LP0000000023128 LP0000000034904 | 20-ఆగస్టు-24 **14-ఆగస్టు-24 నాటికి రూ.3052851& రూ.1600038** | సర్వే నం.217 2 డి.నం. 7 227 2, పోలీస్ క్వార్టర్స్ దగ్గర, సుజాత నగర్ 10వ లైన్, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్, ఒంగోలు, ఆంధ్రప్రదేశ్-523001. 144 చదరపు గజాలు లేదా 120.398 చదరపు మీటర్ల కొలత విస్తీర్ణం. హద్దులు: ఉత్తరం: ప్యాసేజ్, దక్షిణం: ఇతరుల ఆస్తి, తూర్పు: 6అ॥ల రోడ్డు, పడమర: తిరుమలశెట్టి శ్రీరాములు యొక్క ఆస్తి. | లాంఛనప్రాయ స్వాధీనత స్వాధీనత తేదీ: 07-ఫిబ్రవరి -2025 |

తేదీ: 13.02.2025
ప్రదేశము: ప్రకాశం, ఒంగోలు

అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

## మహేంద్రనాథ్ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : స్థానిక యాదవపాలెంలో లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల దేవాలయం 34వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చీరాల నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ కళ్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, భారతీయజనతాపార్టీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## విశిష్ట సంఖ్యతోనే పథకాలు అమలు

విశాలాంధ్ర-పర్చూరు: రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యతోనే ప్రభుత్వ పథకాలు అమలు అవుతాయని సహాయ వ్యవసాయ సంచాలకులు నాగభైరు మోహనరావు తెలిపారు. మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ శాఖద్వారా అందించే విత్తనాలు, రుణాలు, పంట నష్టపరిహారం, బీమా సౌకర్యం, అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకాలు విశిష్ట సంఖ్యతోనే అమలు అవుతాయని తెలిపారు. రైతులు ఆధార్‌ను, పాసుపుస్తకాల జిరాక్స్‌ను తీసుకొని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని, మొబైల్‌ను తీసుకెళ్ళాలని సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి రామ్మోహనరెడ్డి, వీఏఏలు సౌమ్య, అరుణ, ఫిలిఫ్, ఆశా ఉన్నారు.

## ఇంటి పన్నులు నూరుశాతం వసూలు చేయాలి

### డీఎల్పీఓ కేజీవి శ్రీనివాసన్

విశాలాంధ్ర - నిజాంపట్నం : ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలని రేపల్లె డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్పీఓ) కేజీవి శ్రీనివాసన్ అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి, ఈఓపీఆర్డీ ఎం.రవి శంకర్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో ఎస్‌డబ్ల్యూపీసీ,ఇంటి పన్నులు వసూలుపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి ఆయువు పట్టు అయినటువంటి ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలన్నారు.ఇంటి పన్నుల వసూలుపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని, అందుకోసం ప్రణాళికలు వేసుకొని వేగవంతంగా వసూలు చేయాలని సూచించారు. అనంతరం ఇటీవల నూతన డీఎల్పీఓగా బాధ్యతలు చేపట్టిన కేజీవి శ్రీనివాసన్‌ను ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి,ఈఓపీఆర్డీ ఎం.రవిశంకర్, పంచాయతీ కార్యదర్శులు కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలోని హరిస్‌పేట పంచాయతీలో 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శి బి.నాగ సుబ్బారావును డీఎల్పీఓ కేజీవి శ్రీనివాసన్,ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి, ఈఓపీఆర్డీ ఎం.రవి శంకర్ సన్మానించి అభినందించారు.

# ఎస్సీ హాస్టల్ పునర్నిర్మాణం

- రూ.45 లక్షల నిధులతో పూర్తి స్థాయిలో హాస్టల్ ఆధునీకీకరణ
- మంత్రి గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు, గ్రామస్థులు
- నాడు-నేడు అంటూ వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల దుబారా
- మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి

విశాలాంధ్ర - బల్లికురవ : గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరిన సంతమాగలూరు ఎస్సీ వసతి గృహం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో పూర్వవైభవం సంతరించుకుంది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో రేకులు విరిగి,బాత్ రూమ్స్ తలుపులు లేకుండా,శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ.45 లక్షల నిధులతో పునర్నిర్మించారు. నాలుగు నెలల క్రితం సంతమాగలూరు పర్యటనలో భాగంగా హాస్టల్ పరిస్థితిని, విద్యార్థుల దుస్థితిని చూసి చలించిన మంత్రి గొట్టిపాటి విద్యార్థులకు ఎటువంటి ఆటంకాలూ లేకుండా హాస్టల్ భవనాన్ని పూర్తి స్థాయిలో ఆధునీకీకరణ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అంతే కాకుండా వైసీపీ హయాంలో సాంఘిక,సంక్షేమ వసతి గృహాలు నిర్లక్ష్యానికి గురవుతున్న విషయాన్ని సంబంధిత మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి దృష్టికి కూడా తీసుకెళ్లారు.మంత్రి డోలా కూడా వెంటనే స్పందించి సంబంధిత శాఖ నుంచి నిధులను విడుదల చేశారు. ఇలా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని వసతి గృహానికి మరమ్మత్తులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించారు. పూర్తి స్థాయిలో ఎస్సీ హాస్టల్ అందుబాటులోకి రావడంతో విద్యార్థులతో పాటు చుట్టు పక్కల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం మంత్రి గొట్టిపాటి చూపుతున్న చొరవకు వారంతా తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

**- గత ప్రభుత్వ హయాంలో తగ్గిన విద్యార్థులు**

పునర్నిర్మాణం పూర్తి చేసుకున్న సంతమాగలూరు ఎస్సీ హాస్టల్ భవనాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం సందర్శించారు. ఆధునీకీకరించిన భవన సముదాయాలను, ఇతర ప్రాంతాలను మంత్రి స్వయంగా తిరిగి పరిశీలించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో సాంఘిక, సంక్షేమ హాస్టల్ భవనాలన్నీ నిర్వహణాలోపం,నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరాయని తెలిపారు. సంతమాగలూరు ఎస్సీ హాస్టల్‌లో 2019 తెలుగుదేశం ప్రభుత్వ సమయంలో మొత్తం 170 విద్యార్థులు ఉండేవారని గుర్తు చేశారు.వైసీపీ ప్రభుత్వ విధానాలతో ఆ హాస్టల్ విద్యార్థుల సంఖ్య 30 పరిమితమయ్యిందని వాపోయారు.నాడు-నేడు, రేషనలైజేషన్ పేరుతో బడుగు, బలహీన వర్గాలను విద్యకు జగన్మోహన్ రెడ్డి దూరం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పేదల చదువుకు అండగా ఉంటుందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.

## సామాజిక సేవ చేసేందుకే జనసేన

విశాలాంధ్ర - చీరాల : సామాజిక సేవ చేసేందుకే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించారని పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు వీర మహిళలు పనిచేయాలని రాష్ట్ర వీర మహిళ కన్వీనర్ బొందిల శ్రీదేవి అన్నారు.బుధవారం చీరాల రోటరీ క్లబ్‌లో నియోజకవర్గ జనసేనపార్టీ వీర మహిళల ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీదేవి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పవన్ కళ్యాణ్ ఆశయాల సాధన కోసం వీర మహిళలు కృషి చెయ్యాలని,అధికారంలో బాధ్యత కలిగిన నాయకులుగా విరమహిళలు ఉండాలన్నారు.ప్రజలు మంచి చేస్తామని అధికారం ఇచ్చారని ప్రతి వీర మహిళ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు.నియోజకవర్గంలో వీర మహిళలు భవిష్యత్తు ప్రాణాలికను నిర్మించుకొని పార్టీ నాయకత్వంలో పని చేసి సత్ఫలితాలు రాబట్టాలన్నారు.క్రమ శిక్షణ కలిగిన పార్టీలో బాధ్యతతో వ్యవహరించాలని ప్రజా క్షేత్రంలో మన పని తీరు మన రాజకీయ భవిష్యత్తుని నిర్ణయిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో వీర మహిళలు,తోట కోటేశ్వరి,మద్రవుల వీరమ్మ,పద్మిని, చేనేత పార్టీ ఉపాధ్యక్షురాలు అనూష,చీరాల గవర్నమెంట్ హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు లక్కాకుల లక్ష్మి,జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరు శివరామప్రసాద్, మామిడాల శ్రీనివాసరావు,కనపర్తి రామారావు,లక్కాకుల నాగేశ్వరరావు,కిరణ్ తేజ,ఎరిచర్ల అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు




విశాలాంధ్ర - యద్దనపూడి : రాబోయే వేసవిలో గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మీనారాయణ అన్నారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ రజనీ అధ్యక్షత వహించింది.ప్రత్యేక అధికారి డి.ప్రకాష్‌రావు పాల్గొన్నారు. పలువురు మాట్లాడుతూ గ్రామాలలో సిసి రోడ్లను త్వరగా పూర్తి చేయాలని ఉపాధి హామీ పథకంలో కూలీలు 9 మంది తప్పనిసరిగా పాల్గొనాలని, లేనియెడల వాళ్లకి హాజరు నమోదు చేయబడదన్నారు. ఎంఈఓ సిహెచ్ గోపి మాట్లాడుతూ, మండలంలో గన్నవరం, పూనూరు, యద్దనపూడి, జాగర్లమూడి గ్రామాలలో మోడల్ స్కూల్‌లు ఉంటాయని ప్రతి మోడల్ స్కూల్‌కి 50 మంది విద్యార్థులు తప్పనిసరిగా ఉండాలని, ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటారన్నారు. ఏవో మేరమ్మ మాట్లాడుతూ రైతులు సబ్సిడీపై పథకాలు పొందాలంటే ఏపీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్లపునేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, గుదే తారక రామారావు, రాయపాటి సీతయ్య, కోయ సతీష్, కొరటాల వంశీకృష్ణ, సింగ్ చంద్రశేఖర్, కర్లపూడి నారాయణస్వామి, పజ్జా సుబ్బరామయ్య, దొడ్డ అప్పారావు, నిమ్మల సాంబశివరావు, సూరిశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాజీ, కొండల రాయుడు, వంకాయలపాటి సుబ్బారావు, వరద బాబు, డి.వీరయ్యచౌదరి,నర్రా చంద్రశేఖర్, పోపూరి సాంబశివరావు, పోపూరి హనుమంతురావు, తహసీల్దార్ కే.రవికుమార్, సూపర్వైజర్ సుజాత పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలకు గుర్తింపు సంఖ్య తప్పనిసరి

విశాలాంధ్ర - అద్దంకి : వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రభుత్వ పథకాలు లబ్ధి చేకూరాలంటే గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని ఉద్యాన శాఖ అధికారిని దీప్తి అన్నారు. బుధవారం అద్దంకి పట్టణంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దీప్తి మాట్లాడుతూ రైతులు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కొరకు సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. బిందు, తుంపర సేద్య పరికరాలను రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. ఏవో వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శేషారావు,వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భూ యజమానులు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

విశాలాంధ్ర - మార్టూరు : సొంత వ్యవసాయ భూములు కలిగిన ప్రతి రైతు కూడా స్థానిక రైతు సేవా కేంద్రాలలో తమ భూమి వివరాలను నమోదు చేయించుకుని ఆధార్ కార్డు తరహాలో విశిష్ట గుర్తింపు సంఖ్యతో కూడిన గుర్తింపు కార్డు పొందాలని మార్టూరు వ్యవసాయ శాఖ ఏడిఏ కేవీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని బబ్బేపల్లి,రాజుగారిపాలెం రైతులతో బబ్బేపల్లి రైతు సేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయటం ద్వారా రైతులకు 14 అంకెలు గల విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. కేవలం సొంత భూమి గల రైతులకు మాత్రమే గల ఈ ఫార్మర్ రిజిస్ట్రీతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు రాయితీలు,పంటల భీమా మద్దతు ధర పంట రుణాలు వివిధ రకాల వ్యవసాయ, అనుబంధ రంగాల శాఖల సేవలు పొందటానికి అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. భూమిగల రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలేదా వన్‌బి ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు ఆధార్ నంబర్‌తో లింకు చేసుకున్న ఫోన్‌తో సహా స్థానిక రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏవో అంజిరెడ్డి,స్థానిక రైతులు పాల్గొన్నారు.

## బారాయిమామ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కదిరి

విశాలాంధ్ర - సి ఎస్ పురం : కనిగిరి పట్టణంలోని టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ కౌన్సిలర్ జిలానీ తండ్రి బారాయిమామ్ ఇటీవల అకాలమరణం చెందిన విషయం విధితమే. బుధవారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు బారాయి మామ్ గృహానికి వెళ్లి వారి కుమారుడు మాజీ కౌన్సిలర్ జిలానిని పరామర్శించారు. టీడీపీలో తన వెన్నంటే ఉండి తన విజయానికి కృషి చేసారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ షేక్ జిలానీ, మాజీ కౌన్సిలర్ ఫయాజ్, మస్తాన్ వలి, భాస్కర్, మీరావలి, నాగూర్ వలి, రహిమాన్, బాబు, షరీఫ్, భారతి పాల్గొన్నారు.

# ఘనంగా ఏపీ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

విశాలాంధ్ర-ఒంగోలు : 75 సంవత్సరాలు పూర్తి చేసుకుని 76 వసంతంలో అడుగుపెడుతున్న తరుణంలో ప్రకాశం జిల్లా ఏపీ ఎస్పీడీసీఎల్ 1104 యూనిట్ ప్రాంతీయ అధ్యక్షులు కార్యదర్శులు సభ్యులు ఆధ్వర్యంలో ప్లాటినం జూబ్లీ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు, ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ,విశిష్ట అతిథులుగా ఏపీఎస్పీడీసీఎల్ ప్రకాశం జిల్లా ఎస్ఈ కట్ట వెంకటేశ్వర్లు,ఇతర 1104రాష్ట్ర స్థాయి నాయకత్వం శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ముఖ్యంగా ఫిబ్రవరి 12, 1950లో నిర్మాణం అయినటువంటి 114 ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఎందరో ఎలక్ట్రిసిటీ ఉద్యోగాల త్యాగఫలం అన్నారు. ఇంత ఘనంగా నిర్వహించు కుంటానికి కారణమని వక్తలు కొనియాడారు. అదే విధంగా1104 ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒంగోలు సంఘ నూతన కార్యాలయం ఓపెనింగ్, కిమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలోమెడికల్ క్యాంపు నవ్య బ్లడ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించినందుకు నిర్వాహకులకు ముఖ్య అతిథులు అయినటువంటి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు 1104 కార్మిక యూనియన్ సోదరులను అభినందన తెలియజేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన వ్యక్తి విద్యుత్ శాఖ మంత్రిగా గొట్టిపాటి రవి బాధ్యత నిర్వహించడం మీకు ఇటువంటి అవసరం ఉన్నా కూడా మీకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మరియుఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ కార్మికుల పక్షపాతి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కొనియాడారు. ఈ కార్యక్రమానికి 1104 యూనిట్ నాయకులు సభ్యులు మరియు ఇతర నాయకులు మమ్ము ఆహ్వానించడం చాలా ఆనందదాయకమని, తయూనియన్ నాయకత్వంతో మంచి అనుబంధం కలదని ముఖ్యంగా మంచి వ్యక్తి ఈ విద్యుత్ శాఖకు మంత్రిగా ఉండటం ఆనంద దగ్గ విషయమని, ఎటువంటి సమస్యతో వెళ్లిన పాజిటివ్ గా స్పందించే స్వభావం కలిగిన వ్యక్తి మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కార్మికులు మరియు ఇతర ఉద్యోగస్తులు ఎటువంటి సమస్య ఉన్న ఎంతటి సమస్యనైనా పరిష్కరించే దిశగా పనిచేస్తామని కార్మిక సంఘాలతో ఎ మంచి అనుబంధం కలదన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ1104 అధ్యక్షులు హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించారు.

## నాగభైరవ సాహిత్య పురస్కారానికి నూనె అంకమ్మరావు, శెట్లెం చంద్ర మోహన్‌లు ఎంపిక

నూనె అంకమరావు

శెట్లెం చంద్రమోహన్

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రముఖ సాహితీవేత్త, జాతీయ కవి, కవిరత్న డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేరిట ప్రతి సంవత్సరం ఇచ్చే సాహిత్య ప్రతిభా పురస్కారానికి ఒంగోలుకు సంబంధించిన కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావును (2024), రెడ్డి బి.ఎడ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శెట్లెం చంద్ర మోహన్(2025)లను ఎంపిక చేసినట్లు నాగభైరవ సాహిత్య పురస్కార కమిటీ చైర్మన్ సరస్వతీపుత్ర,కళారత్న డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు నుండి తమకు వర్తమానం అందిందని పురస్కార గ్రహీతలు అంకమ్మరావు, చంద్ర మోహన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పురస్కారం ఈనెల 27వ తేదీన గుంటూరు బృందావన గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవాలయం ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదిక మీద జరిగే డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు సాహిత్య పురస్కార సభలో అతిథులుగా పాల్గొనే ప్రముఖ వైద్యులు, న్యాయవాది, రచయిత డాక్టర్ జక్కంపూడి సీతారామారావు, శాంతా కళాశాల అధినేత పెంట్యాల శ్రీమన్నారాయణ, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, దేవస్థానం పాలక మండలి అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు శ్రీమతి తేళ్ళ అరుణ, ప్రముఖ రచయిత మోదుగుల రవికృష్ణ, ప్రజా గాయకుడు నూకతోటి శరత్ బాబు మరియు వారి కుటుంబ సభ్యులు సమక్షంలో పురస్కారాలతోపాటు నగదు బహుమతిని కూడా ప్రదానం చేస్తారని వారు తెలిపారు.

## ఎస్సీ హాస్టల్ నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర - కనిగిరి: మండలం పరిధిలోని కంచర్లవారిపల్లి హైస్కూల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న ఎస్సీ హాస్టల్ నిర్మాణ పనులను నియోజకవర్గ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి బుధవారం పరిశీలించడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ హాస్టల్ నిర్మాణం ద్వారా ఎస్సీ విద్యార్థులకు మరింత అనుకూలంగా వసతి సౌకర్యాలు లభిస్తాయని అలాగే ఈ ప్రాంగణ కూడా అభివృద్ధి చెందుతుందని హాస్టల్ నిర్మాణ పనుల్లో నాణ్యత ఉండేలాగా చూసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. హాస్టల్ నిర్మాణ పనులను పర్యవేక్షించి త్వరితగతిన పూర్తి చేసే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొనడం జరిగింది.

## వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ఉగ్ర, కోటపాటి

విశాలాంధ్ర-పామూరు: శ్రీబాలాజీ జ్యువెలర్స్ అధినేత, అయ్యప్ప స్వామి దేవస్థానం అధ్యక్షులు గుత్తి వెంకట రాజా కుమారుడు వివాహ వేడుకలు బుధవారం తమ నివాస గృహములో ఘనంగా నిర్వహించారు. వివాహ వేడుకలలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్ రావులు పాల్గొని నూతన వరుడు గుత్తి అనిల్ కుమార్ ను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు ను తెలియజేశారు.

# జేఈఈ మెయిన్స్‌లో 'శ్రీ సరస్వతి' హవా

విశాలాంధ్ర -ఒంగోలు : జేఈఈ మెయిన్స్ 2025 పరీక్ష ఫలితాలలో ఆల్ ఇండియా స్థాయిలో అత్యధిక పర్సంటైల్ సాధించినట్లు శ్రీ సరస్వతి విద్యాసంస్థల అధినేత ఏవి రమణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మంగమూరు రోడ్డు లోని శ్రీ సరస్వతి విద్యాసంస్థల ప్రాంగణంలో బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవి రమణారెడ్డి మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించామన్నారు. తమ విద్యార్థులు 98.82,98.71 పర్సంటైల్ తో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారన్నారు. కే లోక్ క్రితి 98.82 పర్సంటైల్ తో జిల్లా మొదటి స్థానంలో నిలవగా, కె గుణశేఖర్ రెడ్డి 98.71 పర్సంటైల్ తో జిల్లా ద్వితీయ స్థానంలో నిలువగా, ఎస్ ఇంద్ర 98.06 పర్సంటైల్ తో జిల్లా తృతీయ స్థానంలో నిలిచారన్నారు. బి రిత్విక్ 96.56, జె యేసుష్ రాయ్ 96.21, కె రథసారథి 96.09, వి పవన్ కళ్యాణ్ 95.37 పర్సంటైల్ సాధించారన్నారు అలాగే మ్యాస్ లో నూటికి 99.36 పర్సంటైల్, ఫిజిక్స్‌లో నూటికి 99.02 పర్సంటైల్, కెమిస్ట్రీలో నూటికి 99.18 పర్సంటైల్ సాధించారన్నారు. 90 పర్సంటైల్ పైగా 20 మంది విద్యార్థులు, 85 పర్సంటైల్ పైగా 38 మంది విద్యార్థులు, 80 పర్సంటైల్ కు పైగా 56 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. జె ఈ ఈ అడ్వాన్స్ 2025 కు 161 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా అత్యధిక ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత ఏవి రమణారెడ్డి, డైరెక్టర్లు ఏ గణేష్ రెడ్డి, ఏ గంగా శంకర్ రెడ్డి, సీఈవో ఎన్ వి సురేష్, డీన్స్, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## ఈవో ఆర్డీ కేజిఏ శ్రీనివాసన్‌కు పదోన్నతి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : మండల ఈవో ఆర్డీగా విధులు నిర్వహిస్తున్న కేజిఏ శ్రీనివాసన్‌కు డిఎల్‌పిఓగా పదోన్నతి లభించింది. ఈ మేరకు బుధవారం ఆయనకు జిల్లా కార్యాలయం నుండి నియామక పత్రం అందినట్లు తెలిపారు. పదోన్నతి పొందిన శ్రీనివాసన్ మండల పరిషత్ కార్యాలయంలో సహోద్యోగులు అభినందనలతో ముంచెత్తారు. పూలదండలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. మండల పంచాయతీ అధికారిగా సమర్థవంతంగా నిర్వహిస్తూ మంచి అధికారిగా పేరు తెచ్చుకున్న శ్రీనివాస్ జిల్లా స్థాయిలో కూడా అంతే ప్రతిభ చూపి మంచి అధికారిగా అందరికీ గుర్తుండిపోతారని మండల అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ సుభాని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఆలపాటి'కి మద్దతుగా 'అనగాని' ప్రచారం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేయుచున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర రెవెన్యూ స్టాంపు, రిజిస్ట్రేషన్‌శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రాజా గెలుపు కోరుతూ బుధవారం మండలంలోని ప్రభుత్వ,ప్రైవేటు ఉపాధ్యాయులను కలిశారు. మొదట కావూరు వినయాశ్రం బాలికల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల అక్కడే ఉన్న డాక్టన్ సంస్థలోని ఉద్యోగాలను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును రాజేంద్రప్రసాద్‌కు వేసి గెలుపుకు సహకరించాల్సిందిగా అభ్యర్థించారు. ఓటమి అనుసరిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి ప్రజలు తప్పకుండా తాము బలపరిచిన అభ్యర్థిని గెలిపిస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జంగా కృష్ణమూర్తి, మైనేని రత్న ప్రసాద్, మోహన్‌రావు, పార్టీ నాయకులు మల్లాది రామకృష్ణ, దివి రాంబాబు, నాగులు పున్నారావు, కందుల వెంకటేశ్వరరావు, దివి శ్రీ నివాసరావు, మిస్సంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రబీ పంటలను గమనిస్తూ ఉండాలి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రెండవ పంటగా సాగు చేస్తున్న మినుము,పెసర పంటలలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించుకుంటూ వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు తీసుకొని పంటలను కాపాడుకోవాలని బాపట్ల ఏడిఏ (డిఆర్‌సి) టి.రత్నకుమారి అన్నారు. బుధవారం మండలంలోని గూడవల్లి,కనగాల గ్రామాలలో వ్యవసాయ,అనుబంధశాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ.మహేష్‌బాబు వీఈఓ మహమ్మద్ భాషా, వ్యవసాయ విస్తరణ అధికారులు తిరుపతమ్మ, ప్రేమ్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు స్వాగత్‌లక్ష్మి పాల్గొన్నారు.

# బౌద్ధంతో ప్రపంచ శాంతి

విశాలాంధ్ర-ఒంగోలు : బౌద్ధ ధర్మ ఆచరణతో ప్రపంచ శాంతి వర్ధిల్లుతుందని ఒంగోలు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సి. హెచ్.సుధాకర్ బాబు తెలియజేశారు. బుధవారం ఒంగోలు పట్టణమందు మాఘ పౌర్ణమి సందర్భంగా బౌద్ధ ధర్మ ప్రచార పాద యాత్ర నిర్వహించారు. బౌద్ధ ధర్మ ప్రచార కేంద్ర నిర్వాహకులు సి. హెచ్.సుధాకర రావు మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు తన ధర్మాన్ని ఆచరించి సర్వమానవ సంక్షేమం సాధించి నిరూపించారని, నేటి పౌరసమాజానికి బౌద్ధ ధర్మమే ఆదర్శం కావాలని విజ్ఞప్తి చేశారు. కావలి అంబేద్కర్ బుద్ధ విహార్ వ్యవస్థాపకులు సంఘ జ్యోతి పాలేటి పుల్లయ్య బోధి మాట్లాడుతూ బోధిసత్వ అంబేద్కర్ ముందు చూపుతో భారతదేశంలో బౌద్ధ ధర్మానికి జీవం పోశారని ఈ రోజు ప్రపంచంలో బౌద్ధం అగ్రగామిగా గుర్తింపు పొందిందని తెలియజేశారు.కందుకూరు దమ్మ చక్ర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉపాసక గాంధ్ల హరిప్రసాదరావు త్రిశరణాలు చెప్పి సభను ప్రారంభం చేశారు. రైతు సంఘం నాయకులు చుండూరి రంగారావు మాట్లాడుతూ బౌద్ధం మూలాలతో డా. అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించారని, రాజ్యాంగాన్ని పాలకులు సక్రమంగా అమలు చేస్తే ప్రజలకు, రైతులకు మేలు జరుగుతుందని తెలియ జేశారు. ఈకార్యక్రమంలో ఐ.ఎల్.పి నాయకులు దాసరి సుందరం, కె.ఎన్.పి.యస్.జార్జి, రెడ్ స్టార్ నాయకులు భీమవరపు సుబ్బారావు, ఆదివాసి నాయకులు పేరం సత్యం, అంబేద్కర్ వాది మురహరి, బుద్దిస్ట్ ఎ.ఎల్ ప్రసాదు, యాదవ సంఘం నాయకులు ఉమ్మేరం అప్పారావు, రైతు సంఘం నాయకులు శేషారెడ్డి పాల్గొని ప్రసంగించారు.

## యువతతోనే రైతుకు ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర -ఒంగోలు : స్థానిక మంగమూరు రోడ్‌లోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకంలో భాగంగా యువతతో రైతుకు ఉజ్వల భవిష్యత్తుపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ మరియు ప్రిన్సిపల్ వై.సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అంటే గో ఉత్పత్తులను ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడుకుంటూ చేసే వ్యవసాయమని, ప్రాంతీయంగా లభించే వనరులతో వ్యవసాయంను చేయుటకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, హానికర, రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకాన్ని విస్మరిస్తూ సేద్యం చేస్తే బాగుంటుందని, ఈ విషయాలపై యువత రైతులు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నేచురల్ ఫార్మింగ్ అధికారి వి.సుభాషిని యువతతో రైతుకు ఉజ్వల భవిష్యత్తు అనే పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశానికి రైతు వెన్నుముఖాన్ని, రైతు లేనిదే రాజ్యం లేదని, కానీ భవిష్యత్తులో రైతు అన్నమాట వినపడకుండా పోతుందని, రైతు కోసం ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ కె.హనుమంతరావు, పాఠశాల హెచ్ఎం కే రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి రాజేంద్ర బాబు, పి రవితేజ, ఈ నీలిమ, ఎస్.కె నిరోషా, అధ్యాపకులు కే ప్రశాంతి లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# వైభవంగా సామూహిక సాగర హారతి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : విశేషమైన మాఘ మాస పౌర్ణమి పర్వదినం సందర్భంగా మండలంలోని వాడ రేవు సముద్ర తీరంలో ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో సామూహిక సాగర హారతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. భజనలు, శివయ్యకు అర్చనలు,అభిషేకాలు చేసి అనంతరం సామూహిక సాగర హారతి సమర్పించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో అవ్వారు శ్రీనివాసరావు, బందారు జ్వాలా నరసింహం,తాడివలస దేవరాజు,కారంచేటి నగేష్ కుమార్,మహిళలు,అధిక సంఖ్యలో హిందూ బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

**పూర్ణాహుతి :** స్థానిక విఆర్ఎస్, వైఆర్ఎన్ కళాశాల ఆవరణలో ఉన్న యజ్ఞశాలలో ప్రపంచ శాంతి యజ్ఞ పూర్ణాహుతి కార్యక్రమం విజయ వంతంగా ముగిసింది.కర్త మురలి మాట్లాడుతూ గత సంవత్సరం విజయ దశమి పర్వదినాన ప్రారంభించిన యజ్ఞం పూర్ణాహుతి కార్యక్రమంతో సమాప్తం అయినట్లు తెలిపారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎం.ఆంజనేయ శర్మ,కళ్యాణ్ శర్మ,చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# 'పేస్'తో సీఎస్ ఈఈ అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర - ఒంగోలు : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలతో సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఎన్విరాన్మెంట్ అండ్ ఎడ్యుకేషన్ (సిఎస్ఈఈ) తెలంగాణ, ఎన్జీవో అవగాహన ఒప్పందాన్ని చేసుకోవడం జరిగింది. ఇందులో భాగంగా కళాశాల విద్యార్థులకు మరియు బోధన సిబ్బందికి సస్టైనబుల్ ప్రాక్టీసెస్, క్లైమేట్ చేంజ్ అవేర్నెస్, పర్యావరణ సంబంధిత కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాలలోని మహిళలు మరియు నిరుద్యోగులు, యువత కొరకు సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ వంటి కార్యక్రమాలు మరియు గ్రామీణ ప్రాంతంలో నివసించే ప్రజల జీవనశైలిని మరియు వసతులను మెరుగుపరచుకునే సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహించే విధంగా ఈఎంఓ యు లు చేసుకోవడం జరిగింది. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ ఎంవోయూను ఉద్దేశించి మాట్లాడుతూ దీని ద్వారా అనేక రకాల పర్యావరణ రక్షణ, అవగాహన, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్, వ్యవసాయ అవగాహన కార్యక్రమాలను విద్యార్థుల చేత చుట్టుపక్కల గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. తద్వారా గ్రామ ప్రజలు లబ్ది పొంది, వారి జీవనశైలిలో మార్పు అభివృద్ధి పొందుతారని హర్షం వ్యక్తం చేశారు. కాలా చాలా ప్రిన్సిపాల్ డాక్టర్ జీకే మూర్తి మాట్లాడుతూ కళాశాల తరపున తాము ప్రతి సంవత్సరం పర్యావరణ పరిరక్షణ, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాము కానీ ఎంఓయు ద్వారా ఎక్కువ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, వర్క్ మోడల్స్, స్వయం ప్రతిపత్తి గ్రూపులకు అందించగలుగుతామని పేర్కొన్నారు. సిఎస్ ఈ ఈ ప్రెసిడెంట్ డాక్టర్ షేక్ దర్గా సాహెబ్ మాట్లాడుతూ కళాశాల ద్వారా మేము చుట్టుపక్కల గ్రామాలలో పర్యావరణ మార్పులు, జీవనోపాధిలో అభివృద్ధిని సాధించగలమని హర్షం వ్యక్తం చేశారు. డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ ఆర్ వీరాంజనేయులు, డీన్ అకాడమిక్ డాక్టర్ సి వి సుబ్బారావు, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం మల్లికార్జునరావు, డీన్ డాక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# డయాలసిస్ సెంటర్ ఆధునికీకరణకు ఆర్థికసాయం

విశాలాంధ్ర-పామూరు: నియోజకవర్గ కేంద్రమైన కనిగిరి కమ్యూనిటీ వైద్యశాలలో ఫ్లోరైడ్ బాధితుల కోసం నిర్వహిస్తున్న డయాలసిస్ సెంటర్ ను దాతల సాయంతో ఆధునికీకరణకు శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి కంకణం కట్టుకున్నారు. దాతలు ఆర్థిక సాయం అందజేస్తున్న తరుణంలో పామూరు పట్టణానికి చెందిన తెలుగుదేశం నాయకులు మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డి, గొర్ల వీరబాబు లు 25 వేల రూపాయలు, ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యదర్శి సయ్యద్ అమీర్ బాబు 25 వేల రూపాయల చెక్కులను శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డికి సోమవారం సాయంత్రం కనిగిరిలో అందజేశారు. టిడిపి యువ నాయకులు, లక్ష్మీ నరసాపురం ఎంపీటీసీ బొల్లా నరసింహారావు పాల్గొన్నారు.

## 'ఇరిగినేని'కి నివాళులర్పించిన 'దారపనేని'

విశాలాంధ్ర పామూరు రూరల్: కనిగిరి మాజీ శాసనసభ్యులు ఇరిగినేని తిరుపతి నాయుడు ఎనిమిదవ వర్ధంతి వేడుకలు ను కనిగిరి మాజీ ఏఎంసి దారపనేని చంద్రశేఖర్ బుధవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా తిరుపతి నాయుడు చిత్రపటానికి పూలమాలతో ఘన నివాళులు దించారు. తిరుపతి నాయుడుతో ఉన్న సంబంధాలను గుర్తు చేసుకున్నారు. కనిగిరి నియోజకవర్గం చేసిన సేవలను చంద్రశేఖర్ కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావిటి వెంకటసుబ్బయ్య, టి ఎన్ ఎస్వి ప్రకాశం జిల్లా మాజీ కార్యదర్శి పోకనాయుడు బాబు, ఘనంగా నివాళు లర్పించారు.

## వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ఉగ్ర, కోటపాటి

విశాలాంధ్ర-పామూరు: శ్రీబాలాజీ జ్యువెలర్స్ అధినేత, అయ్యప్ప స్వామి దేవస్థానం అధ్యక్షులు గుత్తి వెంకట రాజా కుమారుడు వివాహ వేడుక లు బుధవారం తమ నివాస గృహములో ఘనంగా నిర్వహించారు. వివాహ వేడుకలలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్ రావులు పాల్గొని నూతన వరుడు గుత్తి అనిల్ కుమార్ ను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు ను తెలియజేశారు.

## గుడిపాటిపల్లిలో 'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర -వెలిగండ్ల: మండలంలో పందువ, గుడిపాటి పల్లె గ్రామాలలో వ్యవసాయ శాఖ వారి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వ్యవసాయ అధికారి రంగా కృష్ణ రైతులతో మాట్లాడుతూ ప్రతి రైతు రైతు విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రేషన్) ఉన్న చేపించుకోవాలని తెలియపరిచారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ చేపించుకొనుటకు ప్రతి రైతు తమ సమీప రైతు సేవా కేంద్రాలలో తమ వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఆధార్ కార్డు వలె ప్రతి రైతుకు కూడా రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వనున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి లబ్ది చేకూరే పీఎం కిసాన్, పంటల బీమా, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు ఫార్మర్ రిజిస్ట్రీ నందు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే వర్తింప చేస్తారని తెలిపారు. ఫార్మర్ రిజిస్టర్ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల చివరిలోపు రైతులందరూ పూర్తి చేసుకొనుటకు రైతులు తమ పట్టాదారు పాసుబుక్కు ,ఆధార్ కార్డు, మొబైల్ సంఖ్య తో రైతు సేవ కేంద్రాలలో సంప్రదించవలెనని తెలిపారు. ఈ పంట నమోదు చేసుకొని రైతులు ఎవరైనా ఉంటే వెంటనే ఈ పంట నమోదు చేసుకోవాలని, ఈ కేవైసీ పూర్తి చేసుకొనవలెనని ఈ పంట ప్రాముఖ్యత గురించి అందరికీ వివరించారు. శనగ పంటలో సస్యరక్షణ చర్యలు వివరించారు ఈ కార్యక్రమంలో వీఏఏ లు రైతులు పాల్గొన్నారు.

## రాళ్లపల్లి సచివాలయ తనిఖీ

విశాలాంధ్ర-వెలిగండ్ల: మండలంలోని పి. రాళ్లపల్లి సచివాలయాని మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ బాషా బుధవారం సందర్శించారు ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో సమీక్ష నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు మిస్సింగ్ సిటిజన్, జియో ట్యాగ్ ఎన్సీసీఐ, చిల్డ్రన్ ఆధార్ మొదలైన సర్వే లపై రివ్యూ చేసి, త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా సచివాలయ సిబ్బందికి సూచించారు.

## ఎలక్ట్రికల్ షాప్ ప్రారంభించిన మంత్రి

విశాలాంధ్ర - దర్శి : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దర్శి ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మిలు బుధవారం నరసరావుపేట లో నూతన విజయ ల్యాప్ హౌస్ ఎలక్ట్రికల్స్ శానిటరీ - షోలైట్ షోరూం ప్రారంభోత్సవం లో పాల్గొన్నారు. రాష్ట్ర టిడిపి డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వర రావు, టిడిపి యువనాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ , టిడిపి సీనియర్ నాయకులు కడియాల రమేష్ , టిడిపి నాయకులు కడియాల శివ, నరసరావుపేట, దర్శి లోని వివిధ హోదాల్లో ఉన్న టిడిపి నాయకులు పాల్గొన్నారు

## చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

విశాలాంధ్ర - పెద్దదోర్నాల : పెద్ద దోర్నాలలోని ఇందిరా నగర్ లోని రాజేష్ ఇంట్లో ఈనెల 3వ తేదీన జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని బుధవారం అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెడుతున్నట్లు ఎర్రగొండపాలెం సిఐ ప్రభాకర్ రావు తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన పెద్ద దోర్నాలలోని పోలీస్ స్టేషన్లో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎర్రగొండపాలెం సీఐ ప్రభాకర్ రావు మాట్లాడుతూ.నంద్యాల జిల్లా ఆత్మకూర్ గ్రామానికి చెందిన మహబూబ్ బాషా ,పలు దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలియజేశారు. అదే రోజు దేవరాజు గట్టు లో కూడా గృహంలో చోరీ గురి చేశారని, తెలియజేశారు. అలాగే దొంగతనాల కేసులలో, కేసులు నమోదయ్యాయని తెలిపారు. బుధవారం శ్రీశైలం రోడ్లో అనుమానాస్పదంగా తిరుగుతుంటే , అనుమానం వచ్చి పోలీసులు అతని అదుపులో తీసుకొని విచారించగా పలు దొంగతనాల కేసులో నిందితుడిగా గుర్తించారు. దోర్నాల ఎస్సై వి. మహేష్ ,రైటర్ మోహన్, కానిస్టేబుల్ శ్రీను, నారాయణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెట్టి చాకిరి అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

విశాలాంధ్ర - దర్శి : దళిత బహుజన రిసోర్స్ సెంటర్ మరియు సాట్స్ ఎన్జీవో ఆధ్వర్యంలో జి.నాగమణి, ఆర్ విజయలక్ష్మి అధ్యక్షతన వెట్టి చాకిరి నిర్మూలన చట్టంపై ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి ర్యాలీగా గడియార స్తంభం వరకు చేస్తూ మానవహారంతో వెట్టిచాకిరి నిర్మూలన కు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని బాలలను రక్షించాలని మండల విద్యాశాఖది కారి సి హెచ్ రమాదేవి పిలుపునిచ్చారు.వెట్టి చాకిరి నిర్మూలన చట్టం 1976 పురస్కరించుకొని పిల్లలు పనికి కాదు బడికి మాత్రమే అని పెట్టి చాకిరి నిర్మూలిద్దాం స్వేచ్ఛగా స్వతంత్రంగా వారి హక్కులను వారు కాపాడు కోవాలని అందుకు ప్రతి ఒక్కరం సహకరించాలని నినది స్లో ఫ్లకార్డ్స్ ద్వారా మరియు కరపత్రాలు వీడియో డిస్ప్లే ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిహెచ్ రమాదేవి ఎంఈఓ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఇంచార్జ్ రామారావు మరియు ఉపాధ్యాయులు ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారుల సూచనలను పాటించండి

విశాలాంధ్ర - దర్శి : రైతులు వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు సూచనలు పాటించాలని అప్పుడే దిగుబళ్లతోపాటు పంట ఖర్చు కూడా తగ్గుతుందని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త రమేష్ అన్నారు. బుధవారం తూర్పు వెంకటాపురం గ మరియు వెంకటాచలం పల్లి, దర్శి మండలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. దర్శి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ తూర్పు వెంకటాపురం గ్రామంలో ఫ్రంట్ లైన్ డెమో స్టేషన్ కింద కంది 105 రకమును సాగు చేస్తున్న రైతుల పొలాలను సందర్శించడం జరిగింది.

# ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

- మరో యువకుడి పరిస్థితి విషమం
- పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన

విశాలాంధ్ర - కొల్లూరు : ఎదురుగా వస్తున్న ట్రాక్టర్లోని కర్రల లోడ్ తగిలి ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్ర గాయాల భారిన పడి ప్రాణాలతో పోరాడుతున్న సంఘటన మండలంలోని తోకలవారిపాలెం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు మండలపరిధిలోని తోకలవారిపాలెం శివారు తురకపాలెంకు చెందిన కొమరబత్తుని తేజ (23) తన స్నేహితుడైన చిలకా నాగరాజును తన గ్రామమైన తోకలవారిపాలెంలో దించేందుకు మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై తీసుకొని వెలుతున్నాడు. ఎదురుగా కర్రల లోడ్తో కిష్కిందపాలెం వైపు వెళుతున్న ట్రాక్టర్ లైట్ల వెలుతురులో ట్రక్కులో ఉన్న కర్రల లోడ్ కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు నేరుగా వెళ్లి కర్రలకు ఢీకొట్టుకున్నారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు ఇరువురిని 108 వాహనంలో తెనాలి వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే తేజ మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. నాగరాజు తీవ్రగాయాలకు గురై పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు జీజీహెచ్కు తరలించారు. ప్రమాదానికి కారణమైన కొల్లిపర మండలం అన్నవరపులంకకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తోడేటి రవిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

### పోలీసు స్టేషన్ వద్ద ధర్నా

ప్రమాదంలో మృతి చెందిన యువకుడు తేజ బంధువులు, తురకపాలెం వాసులు బుధవారం మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కొల్లూరు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. రేపల్లె-తెనాలి ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. సుమారు రెండు గంటలపాటు ఆందోళన చేసి మృతుడి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వేమూరు సీఐ పీవీ. ఆంజనేయులు, కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు ఆందోళన చేస్తున్న వ్యక్తులతో చర్చించి కేసు నమోదు చేయడం జరిగిందని, డ్రైవర్ సైతం తమ అదుపులోనే ఉన్నాడని ఆందోళన చేస్తున్న వ్యక్తులకు నచ్చచెప్పి ఆందోళనను విరమింపజేశారు.

## నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

విశాలాంధ్ర - బేస్తవారిపేట : చౌక ధరల దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న నిత్యావసర వస్తువులను సక్రమంగా పంపిణీ చేయాలని కోరుతూ మండల సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ జితేంద్రకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని చౌకధరల దుకాణాల ద్వారా పేద ప్రజలకు సరఫరా చేస్తున్న నిత్యావసర వస్తువులను సక్రమంగా పంపిణీ చేయడం లేదని లబ్ధిదారులు సీపీఐ పార్టీ ప్రతినిధుల దృష్టికి తీసుకురావడం జరిగిందని, బియ్యం, జొన్నలు, చక్కెర, కందిపప్పులలో ఒకటిస్తే మరొకటి లేదని ఆయా చౌకధరల దుకాణాల డీలర్లచెబుతున్నారని, నిత్యావసర సరుకులు సక్రమంగా సరఫరా చేసేలా తహశీల్దార్ వారు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఐ గిద్దలూరు నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఊరుమార్పు జోషఫ్, నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి ధాకాల పుల్లయ్య, సీపీఐ తురిమెళ్ల కార్యదర్శి జే. అంకయ్య, కె. రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మి గణపతి శిలా విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర - సిఎస్ పురం : మండలంలోని అయ్యలూరివారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మి గణపతి శిలా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో కనిగిరి మాజీ శాసన సభ్యులు కదిరి బాబురావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కదిరి బాబురావు గారికి ఆలయ అర్చకులు ,గ్రామ పెద్దలు శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల నారాయణ రెడ్డి,వైస్ ఎంపిపి భూమిరెడ్డి వెంకట రెడ్డి, మాజీ ఎంపీటీసీ మునగల నారాయణ రెడ్డి ,ముత్యాల రమణారెడ్డి,జి. రమణారెడ్డి, జి.తిరుమలకొండా రెడ్డి,పెద్దిరెడ్డి రామిరెడ్డి, పాలగుళ్ళ మోహన్ రెడ్డి,నారాయణ రెడ్డి,యస్ శివారెడ్డి,పట్నం తిరుపతయ్య పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

విశాలాంధ్ర - పొన్నలూరు: మండలం ఉప్పలదిన్నె కామేపల్లి మధ్యలో ఉన్న పాలేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను బుధవారం ఎస్సై అనుక్ అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్కు తరలించారు. కామేపల్లికి సంబంధించిన ట్రాక్టర్ యజమానులు జెసిబిని కూడా తీసుకొని వచ్చి జెసిబి తో ఇసుక నింపుతున్న సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందగా ఎస్సై కే అనుక్ హుటాహుటిన వెళ్లి నింపుతున్న ట్రాక్టర్లను జెసిబిని అదుపులోనికి తీసుకుని స్టేషన్కు తరలించారు అనంతరం తహసీల్దార్ పుల్లారావుకు ఈ విషయం ఆయన దృష్టికి తీసుకొని వెళ్ళగా ఆయన ఒక్కొక్క ట్రాక్టర్కు పదివేల రూపాయలు జరిమానా వేసినారు.

## బ్యాంకు రుణాల రికవరీపై సమీక్ష

విశాలాంధ్ర - కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్ల లోని వెలుగు కార్యాలయంలో బుధవారం ఏపీఎం బి సుధాకర్ రావు ఆధ్వర్యంలో బ్యాంకు రుణాలు శ్రీనిధి రుణాల రికవరీలపై కొనకనమిట్ల పొదిలి మండలాల వివోఏలకు గ్రామ ఐక్య సంఘాల సభ్యులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ గ్రూపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించేలా వారికి అవగాహన పెంచాలన్నారు. శ్రీనిధి రుణాలు బ్యాంకులో పావలా వడ్డీ రుణాలను చెల్లించేలా వారికి తెలియజేయాలన్నారు. మార్కాపురం ఏరియా కోఆర్డినేటర్ ఓ సుధాకర్ మాట్లాడుతూ రుణాలు చెల్లింపుల్లో అలసత్వం వహించకుండా రుణాలు సక్రమంగా చెల్లించేలా వారికి అవగాహన కల్పించాలని అంతేకాకుండా గ్రూపులను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొనకనమిట్ల ఏపిఎం బి సుధాకర్ రావు పొదిలి ఏపిఎం కే గోపాలకృష్ణ ఓఎస్ ఎఫ్ఎస్ విపి ఏపీఎం సుబ్బారావు, శ్రీనిధి మేనేజర్ సులోచన లు, శ్రీనిధి రుణా లపై సమీక్షించారు ఈ కార్యక్రమంలో సిసిలు లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేసిన 'ఇరిగినేని'

విశాలాంధ్ర - కనిగిరి: కనిగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతి నాయుడు ఎనిమిదవ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం దివ్యాంగుల హక్కుల వేదిక కార్యాలయంలో దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ధూళిపాళ్ల మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు ఇరిగినేని తిరుపతి నాయుడు చిత్ర పటానికి కనిగిరి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వి వి మనోహర్ , కనిగిరి బ్రాహ్మణ సంఘం నాయకులు ధూళిపాళ్ల వీరభధ్రయ్య, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ ఐ వి నారాయణ, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర సెక్రెటరీ సంగరాజు సాయి మనోజులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ధూళిపాళ్ల మల్లికార్జునరావు మాట్లాడుతూ

దివ్యాంగుల సంక్షేమానికి ఇరిగినేని తిరుపతి నాయుడు ఎంతగానో కృషి చేశారని ఆయన అన్నారు. అనంతరం వి.వి మనోహర్రావు మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో పేద ప్రజల సంక్షేమానికి ఇరిగినేని చేసిన కృషి అపారమైనదని అన్నారు. మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ ఐవి నారాయణ మాట్లాడుతూ ప్రజల హృదయాల్లో ఇరిగినేని చిరస్మరణీయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఐ వి నారాయణ, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి సంగరాజు సాయి మనోజ్, గొల్లపల్లి ఉప సర్పంచ్ ధనుంజయ్, ఆర్య వైశ్య నాయకులు పైడిమర్రి శ్రీనివాసులు, బొగ్గరపు శ్రీను, శ్రీరామలక్ష్మి , నారపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఎలమంద, పాలడుగు నాగేశ్వరరావు, పగ్గాల వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, ప్రజా హక్కుల వేదిక నాయకులు బత్తుల సునీల్, మానవ హక్కుల జిల్లా అధ్యక్షులు భారతి, ఇండ్ల రామకృష్ణ చలువాది నారాయణ, జర్నలిస్టులు తాతపూడి శ్యాం, గోన దానయ్య, ఒలేటి రాధాకృష్ణమూర్తి పాల్గొనడం జరిగింది.

# బండి కోటేశ్వరరావు మృతికి మాజీమంత్రి సురేష్ నివాళి

విశాలాంధ్ర - సింగరాయకొండ : సింగరాయకొండ మండల పరిధిలోని మూలగుంటపాడు గ్రామంలో రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు బండి కోటేశ్వరరావు దశదిన కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం పాల్గొని ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించడం జరిగింది. మాజీ మంత్రివర్యులు, వైయస్ఆర్ సీపీ పిఏసి సభ్యులు, కొండెపి నియోజకవర్గ ఇంఛార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ బండి

కోటేశ్వరరావు వ్యాయామ ఉపాధ్యాయులుగా ఆయన విశిష్ట సేవలు అందించారని, ఎందరో విద్యార్థులను క్రీడా నైపుణ్యతలో విజయాలు సాధించేలా తీర్చిదిద్దారని కొనియాడారు. తదుపరి కుటుంబ సభ్యుల్ని పరామర్శించడం జరిగింది. అనంతరం వైయస్సార్సీపి నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశోక్ కుమార్ రెడ్డి, చుక్కా కిరణ్, ప్రభావతి, మాధవి, కోటేశ్వరరావు, ముబారక్ పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరిస్తేనే ద్విచక్ర వాహనాలకు అనుమతి

విశాలాంధ్ర - కొండపి : ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా వాహనదారుడు హెల్మెట్ ధరించి వాహనం నడిపితేనే కొండపిలోకి అనుమతిస్తామని కొండపి సర్కిల్ ఇన్స్పెక్టర్ జి సోమశేఖర్ ద్విచక్ర వాహనదారులకు సూచించారు. కొండపిలోని పలు కూడళ్ళలో సీఐ సోమశేఖర్ ద్విచక్ర వాహనదారులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే ప్రమాదం జరిగిన సమయంలో మరణాలు జరిగే అవకాశం ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే తగిన రక్షణ ఉంటుందన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి కొండపిలోకి అనుభవించేది లేదని జరిమానా సైతం విధిస్తామని వాహనదారులకు సూచించారు. అదేవిధంగా ట్రాక్టర్లు ఆటోల్లో అధికంగా కూలీలను ఎక్కించి ప్రమాదాలకు గురి చేస్తున్నారని పరిమితికి మించి వాహనాల్లో కూలీలను ఎక్కించుకూడదని తెలిపారు.

## వరిలో అధిక దిగుబడులు సాధించాలి

విశాలాంధ్ర - సింగరాయకొండ : సింగరాయకొండ మండల పరిధిలోని బింగినిపల్లి గ్రామంలో కెవికె కందుకూరు కృషివిజ్ఞానకేంద్రము సైంటిస్ట్ వెంకటేష్ సారు సింగరాయకొండ డివిజన్ యంటి ఎస్తేరమ్మ ఆధ్వర్యములో పాకల చెంచయ్య వరి పంటలో బుధవారం ఫీల్డ్ డే నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రకృతివ్యసాయ పద్దతులు పాటించిన పొలములో 5 5 కొలతల ప్రకారం క్రాప్ కటింగ్ చేసి వాటిలో 21.500 గ్రాములు దిగుబడి వచ్చినది ఒక ఎకరాకు కిలోలు రావడం జరిగింది. ఒక బస్తా 75 కిలోలు ప్రకారము ఒక ఎకరాకు 45 బస్తాలు తేమ వద్దు దిగుబడి రావడానికి రైతు పాటించిన ప్రకృతివ్యసాయ పద్దతులు మొదట పచ్చి రొట్టె పైర్లు పెంచి వాటిని కలయ దున్నడం ఆతరువాత పశువులు ఎరువు వేప పిండి జీవన ఎరువులు దమ్ములో వేయడం వల్ల పరినారును బీజామృతముతో నారు సుద్ది చేసి నాటించడం ద్వారా జీవామృతం వేపనూని పుల్లటి మజ్జిగ సప్త దాన్యాల టానిక్ పసుపు అట్టలు లింగాకర్షణ బుట్టలు వాడాలని తెలిపారు.

# బాధితులకు ఆర్థిక తోడ్పాటు అందిస్తా

బీఎన్ విజయకుమార్



విశాలాంధ్ర - సంతనూతలపాడు: ప్రజలు అనేక తీవ్రమైన వ్యాధులకు గురై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న బాధితులకు ఆర్థిక తోడ్పాటు అందించి అండగా ఉంటానని బీఎన్ విజయకుమార్ పేర్కొన్నారు. గుమ్మలంపాడు వేములపాడు సంతనూతలపాడు గ్రామాలలో పలువురు వ్యాధుల బారిన పడి ఆర్థికముగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు సీఎం సహాయ నిధి రిలీఫ్ ఫండ్ చెక్కులను 13 లక్షల 44 వేల 911 రూపాయల చెక్కులను వారి మంజూరు చేయించి బాధితుల ప్రతిఇంటింటివద్దకు వెళ్లి చెక్కులను అందజేశారు. మండల కేంద్రమైన సంతనూతలపాడు లో మట్ట కామాక్షి 30వేలు చెరుకూరి రాంబాబు 81వేలు పద్మనాభుని వెంకట సుబ్బారావు 69,146 చెరుకూరు శ్రీనివాసరావు 39990 గుమ్మలంపాడు గ్రామంలో నెప్పల సుబ్బారావు 1,28063 బి రామారావు 57500 కొచ్చర్ల ప్రవళిక 1,60931 ఎస్.కె రహేన 2,36363 ఎం నాగవేణి 84995 పద్మావతి 65426 నగదు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బి ఎన్ విజయకుమార్కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. టిడిపి నాయకులు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు బాపట్ల పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంప తోటి అంకారావు తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు బొడ్డపాటి చంద్రశేఖర్ బొడ్డపాటి రమణారావు నెప్పల కనకయ్య నాపల సుబ్బారావు బొడ్డపాటి వెంకటరామయ్య మొలకలపల్లి శ్రీనివాసరావు బొడ్డపాటిశ్రీనివాసరావు నువ్వుల శ్రీనివాసరావు ఎస్సీ సెల్ నాయకులు కంకణాల గోపి తాటితోటి నరసింహారావు చేజర్లయ్య కోతి కోటేశ్వరరావు మార్పుడి జనార్ధన్ మారేళ్ల శ్రీనివాసరావు బోయల్ల రంగనాయకులు నల్లూరి గోపి చిట్టెం శెట్టి శ్రీనివాసరావు సాదినేని శ్రీరామ్ మూర్తి బొడ్డు శంకర్ మందాడి వెంకటేశ్వర్లు టి మాధవ తదితరులు పాల్గొన్నారు.